రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచి వేయాలి

- పంచాయితీలకు దూరంగా ఉండాలి
- తప్పుడు కేసులు నమోదు చేయొద్దు
- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా

నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

నయీంనగర్, డిసెంబర్ 27 : ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులతో పాటు రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా పోలీస్ స్టేషన్, డివిజినల్, జోన్ల వారీగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్తుల అరెస్టు, దర్యాప్తు, సాక్షాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి తగాదాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సమాచారంతో పాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకున్నారనే అంశాలపై సమీక్ష జరిపారు. నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించడంతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, నిజాయితీగా పని చేయాలని, సివిల్ పంచాయితీలకు దూరంగా ఉండాలని, తప్పుడు కేసులు నమోదు చేయొద్దని, పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతి భద్రతలు అదుపు తప్పుతాయని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. సమావేశంలో డీసీపీలు రాజమహేంద్రనాయక్, రవీందర్, ఏఎస్పీ మనన్ భట్, అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

ఇళ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, డిసెంబర్ 27 : గ్రేటర్‌లో డివిజన్ల వారీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమగ్ర సమాచారంతో పక్కాగా నిర్వహించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సర్వేలో సూచించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, టీఎంసీ రమేశ్, ఆర్ఐ విజయ్, సీవో రజిత, ఆర్పీలు షర్మిల, సునీత, లక్ష్మి, అరుణ, మంజుల పాల్గొన్నారు.

గ్రేటర్‌లో 50,934 ఇళ్ల సర్వే..

గ్రేటర్ కార్పొరేషన్‌లో పరిధిలో 1,43,255 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, శుక్రవారం వరకు 50,934 దరఖాస్తుదారులపై సర్వే చేశారు. ఇంకా 92,321 దరఖాస్తులను సర్వే చేయాల్సి ఉంది. గ్రేటర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు.

ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పురుషుల టీం ఎంపిక

ఎంపికైన బాక్సింగ్ టీంతో కార్యదర్శి వెంకయ్య

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 27 : భటిండాలోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ (పురుషుల) టోర్నమెంట్‌లో పాల్గొనే విశ్వవిద్యాలయ టీంను ఎంపిక చేసినట్లు క్రీడా కార్యదర్శి వెంకయ్య తెలిపారు. వీరిలో విశ్వవిద్యాలయ వ్యాయమ కాలేజీ నుంచి సదనపల్లి శ్రీహరి, వరంగల్ వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి హెచ్ రాకేశ్, హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీ నుంచి బచ్చలి రామకృష్ణ, గుండా చంద్రశేఖర్, హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కాలేజీ నుంచి మల్యాల సంజయ్, కాగజ్‌నగర్ వివేకానంద డిగ్రీ కాలేజీ నుంచి విక్రంకుమార్, వరంగల్ కిట్స్ కాలేజీ నుంచి పసుల విన్‌పాల్, గుగులోత్ శేఖర్, శీలం సాకేత్, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి వాడై శివానంద్ ఉన్నారని, వీరికి మేనేజర్‌గా హనుమకొండ శివానీ డిగ్రీ కాలేజీ వ్యాయామ అధ్యాపకుడు రమేశ్ వ్యవహరిస్తారని వెల్లడించారు.

చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

నయీంనగర్, డిసెంబర్ 27 : గోపాలపురంలోని ఆదర్శకాలనీకి చెందిన చిన్నారులు కల్వచర్ల అశ్వంత్‌చారి (9), కందికొండ లక్ష్య (4) ఆడుకుంటూ మరో కాలనీకి వెళ్లిపోయారు. తల్లిదండ్రులకు కనిపించక పోయేసరికి డయల్ 100కు కాల్ చేయడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని గుర్తించి అప్పగించారు. సకాలంలో స్పందించిన కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌తో పాటు సిబ్బందిని కాలనీ వాసులు అభినందించారు.

ముప్పారం గ్రామ పరిధిలో నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన నాన్ లే అవుట్ ప్లాట్లు

పల్లెల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా

- అనుమతులు నిల్.. అక్రమాలు ఫుల్..
- మోసపోతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్, డిసెంబర్ 27 : అధిక సంపాదనే ధ్యేయంగా సామాన్య ప్రజలే లక్ష్యంగా పల్లెల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా జోరుగా సాగుతుంది. రియల్ ఎస్టేట్ మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. ఎలాంటి అనుమతులు లేకుండా నాన్ లే అవుట్ వెంచర్లను ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు అంటగడుతున్నారు. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామ పరిధిలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో అనుమతులు లేకుండా భారీ వెంచర్ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అనుమతులు లేని ప్లాట్లను అంటగడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా చేసి కోట్లు గడిస్తున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా ఏర్పాటు చేయాలంటే నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్మెంట్ యాక్ట్ (నాలా) కింద నాన్ అగ్రికల్చర్ భూమిగా మార్చుకోవాలి. ఇలా నాలా కిందకు మార్చుకోకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూమిని ప్లాట్లుగా ఏర్పాటు చేశారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) నుంచీ ఎలాంటి అనుమతులు పొందలేదని తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించాలని గాంధీ విగ్రహానికి వినతి

నడికూడ, డిసెంబర్ 27 : గాంధీ విగ్రహానికి శుక్రవారం మాజీ సర్పంచ్‌లు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

చెరువులో పడి ఒకరి మృతి

ఎల్కతుర్తి, డిసెంబర్ 27 : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గడ్డం సంపత్(50) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌వో ఉబేదుల్లా తెలిపారు. సంపత్ జగిత్యాల ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో నిర్లక్ష్యం చేసినందుకు 10నెలల క్రితం సస్పెండ్ అయి ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా, ఈ నెల 26న గ్రామ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ ఆధారంగా వెతకగా శుక్రవారం గ్రామ చెరువులో మృతదేహం కనిపించింది. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు సంపత్ చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. భార్య గడ్డం వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వాహనం ఢీకొని మరొకరు..

ధర్మసాగర్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ధర్మసాగర్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాపాకపల్లి గ్రామానికి చెందిన గొల్లెన సారయ్య (56) తన ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి కోమటిపల్లి తండా సమీపంలోని బంకులో పెట్రోల్ పోసుకుని రాపాకపల్లికి వెళ్తుండగా ఉనికిచర్ల గ్రామ శివారులోని పెద్దమ్మ గుడి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సారయ్య తలకు గాయాలు కాగా, చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

కొరవడిన పోలీసుల నిఘా

చోరీ జరిగిన రామాలయాన్ని పరిశీలిస్తున్న సీఐ హరికృష్ణ (ఫైల్)

కమలాపూర్, డిసెంబర్ 27 : మండలంలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు వణుకుతున్నారు. ఏడాదిగా ఆలయాల్లో చొరబడుతూ ఆభరణాలు, హుండీలు ఎత్తుకెళ్లడం, ఇటీవల అంబాలలోని కిరాణాషాపులో కెత్తె శ్రీలత మహిళ మెడలో పుస్తెలతాడు తెంపుకుని పరార్ కావడంతో దొంగల భయంతో బెంబేలెత్తుతున్నారు. ఆరు నెలల క్రితం అంబాల పెద్దమ్మ ఆలయంలో చొరబడి అమ్మవారి బంగారు ముక్కుపుడక, పుస్తెలతాడు, వెండి నగలు, హుండీ ఎత్తుకెళ్లారు. ఆలయంలో చొరబడిన వ్యక్తి సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇరవై రోజుల క్రితం శనిగరం రామాలయం తలుపులు పగులకొట్టి ఆలయంలో చొరబడి పంచలోహ విగ్రహాలు ఎత్తుకెళ్లారు. అలాగే వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి పట్టు వస్త్రాలు దొంగిలించారు. అదే గ్రామంలో మడేలయ్య స్వామి విగ్రహాలను ధ్వంసం చేయడంతో పాటు ఒకే ఊరిలో మూడు ఆలయాల్లో చోరీలు జరిగాయి. అంబాలలో గంగ్రకోట లింగమూర్తికి చెందిన మూడు మేకపోతులు, మూడు గొర్రెపోతులు దొంగిలించారు. వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జరిగిన చోరీల్లో ఇప్పటివరకు పోలీసులు దొంగతనాలను ఛేదించిన దాఖలాలు లేవు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడంతో దొంగలు సమీప గ్రామాలను ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు జరిగిన ఘటనలు బట్టి తెలుస్తున్నది. కొన్ని మాత్రమే వెలుగులోకి రాగా వెలుగులోకి రాని చోరీలు ఎన్నో ఉన్నాయి. పోలీసుల వైఫల్యంతో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుండగులను పట్టుకోడానికి పోలీసులు ఎలాంటి నిఘా పెట్టకపోవడంతో దొంగల బెడద పెరిగిపోయింది. అంబాలలో మహిళ మెడలో సాయంత్రం 7గంటల సమయంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. దుండగులు చైన్ స్నాచింగ్ చేసి ద్విచక్ర వాహనంపై పారిపోతున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు తెలిపారు. అయినప్పటికీ దుండగులను పట్టుకోవడంలో పోలీసుల నిర్లక్ష్యం చేస్తుండడంతో ఎలాంటి ఘటనలు జరుగుతాయోనని గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సీపీఐ శత వసంతాల భారీ ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ నాయకులు

సీపీఐ శత వసంతాల భారీ ప్రదర్శన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 27 : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)100వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో వేయిస్తంభాల దేవాలయం నుంచి హనుమకొండ చౌరస్తా మీదుగా పబ్లిక్‌గార్డెన్ పెట్రోల్ పంపు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సీపీఐది త్యాగాలు, పోరాటాల చరిత్ర అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, డిసెంబర్ 27 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షికాలనీ, శివముక్తి ధామం, రాజ్‌పుత్ వాడ ఏరియాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఏపీజీవీ బ్యాంకులు టీజీవీలో విలీనం

అత్యవసరాలకు నగదు అందజేత : ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ, డిసెంబర్ 27 : ప్రభుత్వ 'వన్ స్టేట్ వన్ ఆర్ఆర్‌బీ' లక్ష్యంలో భాగంగా భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఉత్తర్వు ద్వారా 2025 జనవరి ఒకటో తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో(టీజీబీ) విలీనం అవుతున్నాయని ఏపీజీవీబీ చైర్మన్ కే ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని ఏపీజీవీబీ బ్యాంకు కార్యాలయంలో జనరల్ మేనేజర్ దయాకర్‌తో కలిసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్న నేపథ్యంలో సాంకేతిక కారణాలతో 28, 29, 30, 31వ తేదీల్లో నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని, కానీ ఆర్‌బీఐ, లీడ్ బ్యాంకు అధికారుల సూచనల మేరకు ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు జరుగుకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 30,31వ తేదీల్లో ఖాతాదారుల అత్యఅవసరాల నిమిత్తం సంబంధిత బ్రాంచ్‌ల నుంచి రూ. 10వేల వరకు నగదు అందజేయనున్నట్లు తెలిపారు. వైద్యం, ఊహించని అత్యవసరం ఉంటే ఖాతాదారులు సంబంధిత బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదిస్తే రూ.10వేలకన్నా ఎక్కువ నగదును (అవసరం ఉన్నంత) పోకల్ బ్రాంచ్‌ల నుంచి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 493, ఆంధ్రప్రదేశ్‌లో 278 ఏపీజీవీబీలు వరంగల్ కేంద్రంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఇక నుంచి ఈ బ్యాంకులు హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కింద పనిచేస్తాయని తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి అన్ని సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

మహిళల రక్షణ కోసం కమిటీల బలోపేతం

శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న సంస్థ మేనేజర్ కవిరాజ్

ఆత్మకూరు, డిసెంబర్ 27 : మహిళలు ఆడపిల్లల రక్షణ కోసం మహిళా సహాయక కమిటీలను బలోపేతం చేస్తామని సర్వోదయ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరులోని ముదిరాజ్ సంఘం భవనంలో లింగాధారిత హింస, సహకరించే వ్యవస్థల అనుసంధానంపై మహిళా సహాయక కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబంలో మహిళల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. మహిళలు ఎన్నో ఆటంకాలు ఎదుర్కొంటూ కుటుంబ ఉన్నతికి తోడ్పతున్నారన్నారు. మహిళలపై హింసరహిత సమాజ నిర్మాణం కోసం వివిధ కార్యక్రమాలు చేస్తున్నదన్నారు. అంగన్‌వాడీ టీచర్ అనురాధ, సునీత, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్, కేస్ వర్కర్ హరిత పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కార్పొరేటర్ శివకుమార్

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తి విద్యార్థులు

హసన్‌పర్తి, డిసెంబర్ 27 : హనుమకొండలో ఈ నెల 18న జరిగిన జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో హసన్‌పర్తి జడ్పీ పాఠశాల విద్యార్థిని శీలం సుస్మిత, వైనక్షత్ర, అద్వైత్‌గౌడ్, అలాగే సెయింట్ మేరీస్ పాఠశాల నుంచి అభిలాష్, గుణ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుమదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో వారు ఆడనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు కార్పొరేటర్ శివకుమార్, కోచ్‌లు పార్థసారధి, యాదగిరి, నరేందర్, కుమారస్వామి, నాగరాజు, రమేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరిని పరిశీలిస్తున్న ఏవో సునీల్‌కుమార్

వెదజల్లే పద్ధతిలో సాగు లాభదాయకం

ఐనవోలు, డిసెంబర్ 27 : వరిలో డ్రమ్ సీడర్(వెదజల్లే) పద్ధతిలో సాగు చేయడం రైతులకు లాభదయమని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీల్ కుమార్ అన్నారు. వ్యవసాయధికారుల సూచన మేరకు మండలంలోని ఒంటి మామిడిపల్లికి చెందిన రైతులు పొన్నాల రాజు, పొన్నాల రాజు, పెంత రాజిరెడ్డి డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసే కార్యక్రమాన్ని ఏఈవో అనూషతో కలిసి ఆయన పరిశీలించారు. కూలీల కొరత, పెట్టుబడి తగ్గించడానికి ఈ డ్రమ్ సీడర్ సాగు రైతుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులందరూ వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పెంతల కొమురయ్య, పెంతల మల్లారెడ్డి, ఎండీ పీర్ మహ్మద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మడికొండ, డిసెంబర్ 27 : మడికొండ చౌరస్తాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంపై శుక్రవారం కేసు నమోదైంది. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన బూర్ల రాజేశ్‌కన్నా మడికొండ చౌరస్తాలో బైకుపై ఆగి ఉండగా వెనుక నుంచి ధర్మసాగర్ వెళ్లే టిప్పర్ ఢీకొంది. దీంతో రాజేశ్ కుడికాలు నుజ్జునుజ్జు కాగా, బాధితుడి భార్య మౌనిక ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు కేయూలో నేషనల్ సెమినార్

హనుమకొండ రస్తా, డిసెంబర్ 27 : కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నేషనల్ సెమినార్ నిర్వహించనున్నట్లు యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ ఆఫ్ తెలంగాణ కో ఆర్డినేటర్ ధర్మపురి రాజగోవింద్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సెమినార్‌లో ప్రపంచ దేశాల 'సుస్థిరాభివృద్ధి' తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనున్నట్లు చెప్పారు. మండల పరశురాములు, పొనుగోటి అశోక్‌కుమార్, గోసికొండ సుధాకర్, కామేశ్వర్‌రావు, రామయ్య పాల్గొన్నారు.

సెమినార్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు రాజగోవింద్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి

కాజీపేట/హనుమకొండ చౌరస్తా/హనుమకొండ/శాయంపేట/దామెర, డిసెంబర్ 27 : కాజీపేట చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు చిరు వ్యాపారులు శుక్రవారం నివాళులర్పించారు. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ పాల్గొని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. కార్యక్రమంలో షేక్ అజ్గర్, నూనె శ్రీను, గులాం రసూల్, మురళీ, సయ్యద్ సర్వర్, హనుమయ్య, రవి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పూ లమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, నాయకుడు వరద రాజేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కు సమ్మె శిబిరం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు ఎండీ షఫీ, శ్రీధర్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మౌనం పాటించారు. టీసీఆర్పీఏ రాష్ట్ర బాధ్యులు మొగిలిచర్ల శ్రీనివాస్, రఘు, జ్యోతి, మనోజ శ్రీనివాస్, స్వాతి, హిమసాగర్ పాల్గొన్నారు. శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర నాయకుడు దామెరకొండ కొమురయ్య మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దామెర మండలంలోని ఊరుగొండలో పోలెపాక శ్రీనివాస్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రేటర్ 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట జంక్షన్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కార్పొరేటర్ మామిండ్ల రాజు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హనుమకొండ చౌరస్తా : మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు ప్రారంభం

నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సత్యనారాయణకు శేఖర్‌బాబు స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న రమేశ్‌బాబు, అశోక్‌కుమార్

హసన్‌పర్తి, డిసెంబర్ 27 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు వనం లక్ష్మీకాంతారావు అధ్యక్షతన శుక్రవారం భీమారంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. మొదటిరోజు టీబీఆర్ ఆర్ట్ కూకట్‌పల్లి (హైదరాబాద్)కి చెందిన కీ.శే పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన అయ్యప్ప పద్యనాటకాన్ని టీ బాబు దర్శకత్వంలో ప్రదర్శించారు. మొదట మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజితావెంకటేశ్వర్లు, పందిళ్ల రమేశ్‌బాబు, పందిళ్ల అశోక్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సారంగపాణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల సారంగపాణి, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్ హాజరయ్యారు. అనంతరం పందిళ్ల శేఖర్‌బాబు స్మారక పురస్కారాన్ని రచయిత, నటుడు దర్శకుడు తోట సత్యనారాయణకు పందిళ్ల శేఖర్‌బాబు సోదరులు పందిళ్ల రమేశ్‌బాబు, పందిళ్ల అశోక్‌కుమార్ అందజేశారు. ఈ నాటకోత్సవాల్లోని సన్నివేశాలను ప్రజలు చూసి మంత్రముగ్ధులయ్యారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఓడపల్లి చక్రపాణి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి రమేశ్, దేవరాజు, రవీందర్, జేఎన్ శర్మ, సీతావెంకట్, నాగరాజు, కళాకారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎలక్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565